ప్రజాశక్తి
శనివారం 20 సెప్టెంబర్ 2025 | 8 పేజీలు
ఎన్‌టిఆర్ | కృష్ణా





బందరులో ఉద్రిక్తత

● వైసిపి 'చలో మెడికల్ కళాశాల' ● అడ్డుకున్న పోలీసులు ● ఇరువైపులా భారీగా మొహరింపు

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ : మచిలీపట్నం (బందరు) లో వైసిపి ఆధ్వర్యాన 'చలో మెడికల్ కాలేజీ' నినాదంతో చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత ఏర్పడింది. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించొద్దని డిమాండ్ చేస్తూ శుక్రవారం వైసిపి నేతలు ఆందోళన నిర్వహించారు. చలో మెడికల్ కాలేజీ నిరసనకు వెళ్లకుండా వైసిపి నేతలు, శ్రేణులపై పోలీసులు ఆంక్షలు విధించారు. ఈ కార్యక్రమానికి అనుమతి లేదంటూ పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. గురువారం రాత్రి కొందరు వైసిపి నేతలను ఎక్కడికక్కడ గృహ నిర్బంధంలో ఉంచారు. ఈనేపథ్యంలో మచిలీపట్నం పుర వీధుల్లో అటు వైసిపి





చలో మెడికల్ కళాశాల కార్యక్రమాన్ని అడ్డుకుంటున్న పోలీసులు; రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న వైసిపి నేతలు

(మిగతా 2లో)

విఐపి దర్శనాలపై ఆంక్షలు

● దసరా ఉత్సవాలపై మంత్రి ఆనం ● అంతరాలయ దర్శనాలు, రూ.500 టికెట్లు రద్దు
● కమాండ్ కంట్రోల్ కేంద్రం ఏర్పాటు ● 4 వేల మంది పోలీసులు, 500 సీసీ కెమెరాలతో భద్రత
● మూలా నక్షత్రం, విజయదశమి రోజుల్లో దర్శన సమయం పెంపు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : దసరా ఉత్సవాల్లో విఐపి దర్శనాలపై ఆంక్షలు విధించినట్లు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. విజయవాడ కనక దుర్గమ్మ దేవస్థానం ఆధ్వర్యాన జరిగే దసరా శరన్నవాత్రి మహోత్సవాల ఏర్పాట్లపై శుక్రవారం నగరంలోని మోడల్ గెస్ట్ హౌస్‌లో వివిధ శాఖల మంత్రులు, అధికారులు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు ఆనం, వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్, సత్య కుమార్ యాదవ్, కొలుసు పార్థసారథి, కొల్లు రవీంద్ర, ఎంపి కేశినేని శివనాథ్ తదితరులు పాల్గొన్నారు. అధునాతన క్యూ లైన్లు, హోల్డింగ్ ఏరియాలు, తాగునీరు, పారిశుధ్యం, మరుగుదొడ్లు, భక్తుల భద్రత, స్నాన ఘాట్ల వద్ద ఏర్పాట్లు, ప్రసాదాల పంపిణీ, అన్న ప్రసాదం, కమాండ్ కంట్రోల్ కేంద్రం ఏర్పాటు, ప్రోటోకాల్ దర్శన సమయాలు.. ఇలా వివిధ అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. గతేడాది 9 రోజుల్లో దాదాపు 13 లక్షల మంది వచ్చారని, ఈసారి ఆ సంఖ్య 20 లక్షలకు చేరే అవకాశముందని అంచనా వేశారు. సమావేశం



సమీక్షలో మంత్రులు ఆనం, అనిత, అనగాని, సత్యకుమార్, సారథి, కొల్లు

(మిగతా 2లో)

'విలీనం'పై పరిష్కారం ఎప్పుడు ?

● నిలిచిపోయిన ఆర్థిక సంఘం నిధులు
● ఎన్నికలకు దూరంగా 17 గ్రామ పంచాయతీలు, రెండు మున్సిపాలిటీలు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాల్లో సమీప గ్రామ పంచాయతీల విలీన ప్రతిపాదన ఆచరణకు నోచుకోవడంలేదు. కృష్ణాజిల్లాలో విలీన ప్రతిపాదిత 17 గ్రామ పంచాయతీలకు, గుడివాడతోపాటు నూతనంగా ఏర్పాటైన తాడిగడప మున్సిపాల్టీలకు వివిధ కారణాలతో ఎన్నికలు నిర్వహించకపోవడంతో వాటికి గత నాలుగేళ్లుగా కేంద్ర ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయి. ఆస్తి, నీటి పన్నుల వసూలుతోనే పంచాయతీలు, మున్సిపాల్టీలు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుధ్య నిర్వహణ తదితర మౌలిక వసతులు కల్పన వంటివి సమస్యలుగా తయారయ్యాయి. మచిలీపట్నం మండలంలోని తొమ్మిది పంచాయతీలు అరిసేపల్లి, పోతేపల్లి, మేకావానిపాలెం, కరగ్రహారం, చినకరగ్రహారం, గరాలదిబ్బ, రుద్రవరం, ఎస్ఎన్ గొల్లపాలెం, సుల్తానగరంలను మచిలీపట్నం నగరపాలక సంస్థలో విలీనం చేయడానికి చేసిన ప్రతిపాదనలు ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో మచిలీపట్నం మండలంలోని జడ్‌పిటిసితోపాటు 20 ఎంపిటిసి స్థానాలకు ఎన్నికలు నిలిపివేశారు. అలాగే గుడివాడ మండలంలోని ఐదు పంచాయతీలు లింగవరం, వలివర్తిపాడు, మల్లాయిపాలెం, బొమ్ములూరు, బిళ్లపాడులను గుడివాడ మున్సిపాలిటీలో కలపాలని ప్రతిపాదించారు. గుడ్లవల్లేరు మండలంలోని గుడ్లవల్లేరు, కూరాడ, కౌతవరం పంచాయతీలను కలిపి గుడ్లవల్లేరు నగర పంచాతీయగా మార్చాలని ప్రతిపాదించారు. ఈ రెండు ప్రతిపాదనలపై కొందరు స్థానికులు కోర్టును ఆశ్రయించారు.



దీంతో గుడివాడ మున్సిపాల్టీ, గుడ్లవల్లేరు పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించలేదు. తాడిగడప, యనమలకుదురు, కంకిపాడు, పెనమలూరు పంచాయతీలను విలీనం చేసి తాడిగడప మున్సిపాల్టీగా ప్రభుత్వం మార్చింది. అయితే ఈ మున్సిపాల్టీకి కూడా ఎన్నికలు నిర్వహించలేదు.

ఆదాయం కోల్పోయిన పంచాయతీలు

ఎన్నికలు నిర్వహించి స్థానిక పాలకవర్గాలు కొలువు దీరిన మున్సిపాల్టీలు, పంచాయతీలకు జనాభా ప్రాతిపదికన కేంద్ర ఆర్థిక సంఘం నిధులు విడుదల చేస్తుంది. దీనిలో భాగంగా కృష్ణాజిల్లాలోని 480 గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.22.98 కోట్లు విడుదలయ్యాయి. చిన్న పంచాయతీకి సగటున లక్ష రూపాయలు, మేజర్ పంచాయతీలకు రూ.4 లక్షల నుండి రూ.6 లక్షల వరకు విడుదలయ్యాయి. అయితే ఎన్నికలు జరగని 17 పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయలేదు.

నేడు 'ప్రజాశక్తి' కథా, పాటల సంకలనాల ఆవిష్కరణ

విజయవాడ : మేడే సందర్భాన్ని పురస్కరించుకుని ప్రజాశక్తి సాహితీ సంస్థ నిర్వహించిన రచనల పోటీలో ఎంపికైన కథలు, పాటల సంకలనాల ఆవిష్కరణ సభ శనివారం సాయంత్రం విజయవాడలోని బాలోత్సవ భవన్ (రాఘవయ్య పార్క్ ఎదురు సందు)లో జరగనుంది. ఈ సందర్భంగా కథలు, పాటల పోటీ విజేతలకు బహుమతీ ప్రదానం జరుగుతుంది. కథల పోటీకి 300 కథలు రాగా– శింగరాజు శ్రీనివాసరావు, హరి వెంకట రమణ, బిఎల్ గాయత్రి; పాటల పోటీకి సుమారు 200 రచనలు రాగా– కె.ఆనందాచారి, టి.పావెల్, ఇమంది అశోక్ కుమార్ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందారు. వీరి రచనలతోపాటు మరో 22 కథలు, 57 పాటలు కలిపి సంకలనాల ప్రచురణ జరిగింది. 'డప్పు' కథల సంకలనాన్ని ప్రజాశక్తి దినపత్రిక సంపాదకులు బి.తులసీదాస్, 'మేడే పాటలు' పుస్తకాన్ని ప్రజాశక్తి బుక్‌హౌస్ సంపాదకులు ఎంవిఎస్ శర్మ ఆవిష్కరిస్తారు. విజేతలకు గోళ్ళ నారాయణ రావు బహుమతీ ప్రదానం చేస్తారు. కథల సంకలనాన్ని డాక్టర్ ఎం.ప్రగతి, పాటల సంకలనాన్ని దేవేంద్ర పరిచయం చేస్తారు. సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ ఆత్మీయ అతిథులుగా హాజరవుతారు. సాహిత్య ప్రస్థానం వర్కింగ్ ఎడిటర్ సత్యాజీ అధ్యక్షత వహిస్తారు.

ఆకట్టుకున్న దసరా సాంస్కృతికోత్సవాలు

వివిధ అభ్యుదయ సంఘాలు, సంస్థల ఆధ్వర్యాన విజయవాడలో నిర్వహిస్తున్న దసరా సాంస్కృతికోత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. రెండు రోజులపాటు ఈ ఉత్సవాలు జరిగాయి. రెండో రోజున మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబివికె)లో వివిధ కళాశాల నుండి సుమారు 1100 మంది వరకు విద్యార్థులు పాల్గొని ప్రదర్శనలు ఇచ్చారు. సాయంత్రం జరిగిన ముగింపు సభలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పర్యావరణ శాఖ ప్రొఫెసర్ బ్రహ్మాజీరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, నలంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.అనురాధ, దసరా సాంస్కృతిక ఉత్సవాల కమిటీ కన్వీనర్ కె.స్వరూపరాణి మాట్లాడారు. అనంతరం పోటీల్లో పాల్గొన్న వారందరికీ సర్టిఫికెట్లను అందజేశారు. విజయ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రాఘవ లక్ష్మి, ప్రముఖ రచయిత్రి వేమూరి సత్యవతి, ఎంబివికె కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ, ఉత్సవాల నిర్వహణ కమిటీ సభ్యులు ఎస్.అనీష్, ఉషా రాజా, జి.వాణి, బబితా జైన్, ఇన్నర్ వీల్ సన్ షైన్ ఎం శేషారత్నం, రత్నకుమారి, ఎ.రత్నలక్ష్మి , లీలా కుమారి, భారతీదేవి, గహాప్తి, పూర్ణిమ, సూర్య కామేశ్వరి, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

(పూర్తి వివరాలు మెయిన్, లోపలి పేజీల్లో)



మొదటిపేజీ తరువాయి

బందరులో ఉద్రిక్తత

శ్రేణులు, ఇటు పోలీసులు భారీస్థాయిలో మోహరించారు. మచిలీపట్నం మెడికల్ కాలేజీకి ముఖద్వారంగా ఉన్న దిమ్మల సెంటర్ వద్ద పెద్దఎత్తున భారీ కేడ్లు మోహరించి అటువైపు వెళ్లడానికి అవకాశం లేకుండా కట్టుదిట్టం చేశారు. వైసిపి నేతలు పేర్ని నాని, దేవినేని అవినాష్, మొండితోక జగన్మోహనరావు, కైలే అనిల్‌కుమార్, సింహాద్రి రమేష్‌బాబు, దేవభక్తుని చక్రవర్తి, పేర్ని కిట్టు, ఉప్పాల రాముతోపాటు వైసిపి శ్రేణులను పోలీసులు మూడు స్తంభాల సెంటర్ వద్ద పోలీసులు అడ్డగించారు. ఓ దశలో పేర్ని నాని, దేవినేని అవినాష్, ఉప్పాల రాము పోలీసుల దిగ్బంధంలో చిక్కుకుపోయారు. వైసిపి నేతల వాహనాలను పోలీసులు నిలిపివేశారు. దీంతో నేతలు వాటిని అక్కడే వదిలేసి నడుచుకుంటూ నేతలు ముందుకు సాగారు. దీంతో నగరంలో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఈ సందర్భంగా పేర్ని నాని మాట్లాడుతూ తమ ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి 17 మెడికల్ కళాశాలలను తీసుకొచ్చిందని, అయితే కూటమి ప్రభుత్వం వాటిని అభివద్ధి చేయకుండా పిపిపి పేరుతో ప్రైవేటుపరం చేసేందుకు ప్రయత్నిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు.

విఐపి దర్శనాలపై ఆంక్షలు

అనంతరం మంత్రి ఆనం మీడియాతో మాట్లాడుతూ దసరా మహోత్సవాల్లో సామాన్యులకు పెద్దపీట వేస్తామన్నారు. విఐపి, వివిఐపి దర్శనాలను తగ్గిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ ప్రోటోకాల్ పరిధిలోకి వచ్చే ప్రముఖులకు మాత్రమే అంతరాలయ దర్శనం కల్పిస్తామన్నారు. రిఫరెన్స్ లేఖలపై వచ్చే వారు బంగారు వాకిలి నుంచే దుర్గమ్మను దర్శించుకోవాల్సి ఉంటుందని చెప్పారు. మూలా నక్షత్రం, విజయ దశమి రోజుల్లో దర్శన సమయాన్ని 22 గంటలకు పెంచాలని నిర్ణయించిన్నట్లు పేర్కొన్నారు. పంచ హారతి సమయంలో ప్రముఖులకు ప్రత్యేక దర్శనాలను, ఉత్సవాల్లో అంతరాలయ దర్శనాలను పూర్తిగా రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ఉదయం ఏడు నుంచి 9 గంటల మధ్య, సాయంత్రం మూడు నుంచి ఐదు గంటల మధ్య విఐపి దర్శనాలు ఉంటాయని తెలిపారు. వద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. శరన్నవరాత్రులు అన్ని రోజులు రూ.500 దర్శన టికెట్‌ను రద్దు చేశామని, ఆ క్యూ లైన్‌ను కూడా సాధారణ సందర్శకులకు వినియోగిస్తామని తెలిపారు. మూలా నక్షత్రం, విజయదశమి రోజుల్లో ఎలాంటి టికెట్లు విక్రయించబోమని చెప్పారు. పూర్తి ఉచిత దర్శనాలే ఉంటాయని, ఆయా రోజుల్లో లడ్డు ప్రసాదం ఉచితంగా అందజేస్తామని తెలిపారు. మూలా నక్షత్రం రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు దుర్గమ్మకు ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పిస్తారని చెప్పారు. ప్రతిరోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అన్న ప్రసాద వితరణ ఉంటుందన్నారు. ఉత్సవాల్లో 4 వేల మంది పోలీసు సిబ్బంది, 1000 మంది రెవెన్యూ, వివిధ శాఖల ఉద్యోగులు, 3 వేల మంది పురపాలక ఉద్యోగులు బాధ్యతలు నిర్వహిస్తారని తెలిపారు. 500 సిసి కెమెరాలు, 24 డ్రోన్లను వినియోగిస్తున్నామని చెప్పారు.పారిశుధ్య నిర్వహణకు 400లకుపైగా తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పారిశుధ్య పనుల కోసం 673 మంది కార్మికులు, 30 నుంచి 40 వాహనాలు, 10 బస్సులు, 40 ట్రాక్టర్లను వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. క్యూలైన్లో యాత్రికులకు దాదాపు 30 లక్షల ఉచిత మంచినీటి బాటిళ్ల పంపిణీ చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యేలు సుజనా చౌదరి, గద్దె రామ్మోహన్, బొండా ఉమామహేశ్వరరావు, దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్, కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, దుర్గగుడి ఇఒ వీకే శీనా నాయక్, ముఖ్య ఉత్సవాల అధికారిణి డి.భ్రమరాంబ, విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

సమాజ రుగ్మతలను ఎత్తిచూపిన బోయి భీమన్న

- మంత్రి కందుల దుర్గేష్
- పూర్ణచందుకు స్మారక పురస్కారం ప్రదానం

ప్రజాశక్తి - విజయవాడ : తన రచనల ద్వారా సమాజ రుగ్మతలను మహాకవి, పద్మభూషణ్ పురస్కార గ్రహీత డాక్టర్ బోయి భీమన్న ఎత్తిచూపారని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో విజయవాడ కలెక్టరేట్లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధ్యక్షతన శుక్రవారం డాక్టర్ బోయి భీమన్న 114వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో మంత్రి దుర్గేష్ ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడుతూ నేడు మనం మానవ హక్కులు, దళిత హక్కుల గురించి మాట్లాడుతున్నామని, అయితే అస్పృశ్యత తీవ్రంగా ఉన్న రోజుల్లోనే వీటి గురించి బోయి భీమన్న ప్రస్తావించడం గొప్ప విషయమని అన్నారు. ఆనాడు ఎదురవుతున్న సమస్యలను, విద్యను అభ్యసించడానికి ఉన్న ఇబ్బందులను తెలుపుతూ "జానపదుల జాబులు" అనే రచన చేశారని చెప్పారు. కుల, మత, వర్గ విభేద రహితమైన భారతజాతి ఆవిర్భావించాలనేదే తన ధ్యేయమని ప్రకటించిన భీమన్నది మహెూన్నత వ్యక్తిత్వమన్నారు. ఆయన మాట, బాట అందరికీ అనుసరణీయమని అన్నారు. బోయి భీమన్న సతీమణి సుప్రసిద్ధ రచయిత్రి బోయి హైమావతి మాట్లాడుతూ పగటి దివిటీల వెలుగులో బోయి భీమన్నకు నాటి గుంటూరు జిల్లా (ప్రస్తుత బాపట్ల జిల్లా) చెరుకుపల్లిలో గండపెండెరం తొడిగారని చెప్పారు. వైద్యులు, శతాధిక గ్రంథకర్త డాక్టర్ జీవి పూర్ణ చంద్‌ను ఈ పురస్కారానికి ఎంపిక చేయటం సముచితమన్నారు. అనంతరం మంత్రి కందుల దుర్గేష్ జీవి పూర్ణ చందును దుశ్శాలువాతో సత్కరించి రూ.2 లక్షల నగదు పురస్కారం అందజేశారు. పూర్ణ చందు రచించిన భువనవిజయం పుస్తకాన్ని ఆవిష్కరించారు. సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ల మల్లికార్జునరావు చిత్రించిన 'అఖండ తాండవం' చిత్తరువును (పెయింటింగ్) మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ లక్ష్మీ నరసింహం, సాంస్కృతిక శాఖ సంచాలకులు మల్లికార్జునరావు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి కందుల దుర్గేష్



డాక్టర్ జి.వి.పూర్ణచంద్

చల్లపల్లి ఎంపిడిఒగా ఆనందకుమారి బాధ్యతల స్వీకారం

ప్రజాశక్తి చల్లపల్లి : చల్లపల్లి ఎంపీడీవోగా ఎం.ఎం ఆనంద కుమారి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కంచికచర్లలో ఏవోగా పనిచేస్తున్న ఆనందకుమారి పదోన్నతపై చల్లపల్లి ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. చల్లపల్లిలో పనిచేసిన డాక్టర్ ఏవి రమణ డి ఎల్డివో గా పదోన్నతి పొందారు. ఎంపీడీవో గా బాధ్యతలు స్వీకరించిన ఆనందకుమార్ ని సూపరిండెంట్ లతాఉల్లా, పి ఆర్ ఏ ఈ బొప్పన శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ శాంసంన్, జూనియర్ అసిస్టెంట్ ప్రసన్నలక్ష్మి, టైపిస్టు పూసపాటి బ్రహ్మానందం కార్యదర్శులు శుభాకాంక్షలు తెలిపారు.



మాణిక్యాలరావును పరామర్శిస్తున్న విక్కుర్తి

మాణిక్యాలరావును పరామర్శించిన విక్కుర్తి

ప్రజాశక్తి-అవనిగడ్డ : రాధా రంగ మిత్ర మండలి దివీ యూనిట్ అధ్యక్షులు రాజనాల మాణిక్యాలరావును ప్రముఖ పారిశ్రామికవేత్త కూటమి నాయకులు విక్కు ర్తి వెంకట శ్రీనివాసరావు పరామర్శించారు. మాణిక్యాలరావు ఇటీవల గుండెకు సంబంధించిన శాస్త్ర చికిత్స చేయించు కున్నారు. విషయం తెలుసుకున్న శ్రీనివాస్ శుక్రవారం మాణిక్యాల రావును పరామర్శించి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. మాణిక్యాలరావు త్వరగా కోలుకో వాలని శ్రీనివాస్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విక్కు ర్తి రాంబాబు, న్యాయవాది విక్కు ర్తి రామకష్ణ, షేక్ బాజీ, హెూటల్ ప్రసాద్, విజయ్ కుమార్, పులిగడ్డ చంద్ర వర్మ, తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిది మందికి కారుణ్య నియామకపత్రాలు అందజేత

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ కారుణ్య నియామక పత్రాలను అందజేశారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్లోని మీకోసం సమావేశం హాలులో 9 మందికి వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగ అవకాశాలను కల్పిస్తూ ఉత్తర్వు పత్రాలను అందించారు. వారిలో ఏడుగురికి జూనియర్ అసిస్టెంట్లు, ఒకరికి గ్రామ వార్డు సచివాలయం, మరొకరికి ఆఫీస్ సబార్డినేట్ గా నియమించారు. ఉద్యోగం పొందిన వారు బాధ్యతగా వ్యవహరిస్తూ తమ కుటుంబాలకు ఆసరాగా ఉండాలని, అంకితభావంతో విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

రెండో రోజుకు వీఆర్ఏల దీక్షలు



ఉయ్యూరులో...

ప్రజాశక్తి-ఉయ్యూరు : దీర్ఘకాలంగా అపరిష్కతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం పిలుపుమేర ఉయ్యూరులో గ్రామ రెవెన్యూ సహాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట రెండోరోజు శుక్రవారం దీక్ష కొనసాగించారు. స్థానిక సంఘ నాయకులు డి.ఎడుకొండలు, సులేమాన్రాజు, కొడాలి రాహుల్, నాగభూషణం పాల్గొనగా సిఐటియు మండల కన్వీనర్ బి. రాజేష్ విఆర్ఏలకు సంఘీభావం ప్రకటించారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** గుడ్లవల్లేరు తాసిల్దార్ కార్యాలయం ఎదుట మండల వి ఆర్ ఎ సంఘం అధ్యక్షులు జుజ్జువరపు యేసేబు, ఉపాధ్యక్షులు ఉడుముల రవి కిరణ్, మండల వీఆర్ఏలు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గన్నవరం :** ప్రభుత్వం సమస్యలు పరిష్కరించే వరకు దశలవారీగా పోరాటం చేస్తూనే ఉంటామని వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షులు బొడ్డు వెంకటరత్నం స్పష్టం చేశారు. విఆర్ఏలు శుక్రవారం ధర్నా నిర్వహించారు. వెంకటరత్నం, సంఘం గన్నవరం మండలం అధ్యక్షులు పూర్ణచంద్రరావు, సంఘ కార్యదర్శి . రామకష్ణ, కోశాధికారి డి. అను, సంఘ సుభ్యులు సుజాత, గీత, జోసిన్, స్వర్ణ, గున్ని, లక్ష్మి, పద్మారావు, షహనాజ్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పామర్రు :** వీఆర్ఏల సమస్యల పరిష్కారానికి ఈనెల 23న విజయవాడలో జరగనున్న రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక తాసిల్దార్ రవికాంత్కు వినతిపత్రం అందించారు. పామర్రు మండల అధ్యక్షులు జే.బాబుజి, కార్యవర్గ సభ్యులు దాసరి ప్రసాద్, చాట్లా రమేష్,ప్రభాకర్,గోపి తదితరులు పాల్గొన్నారు.

'మీకోసం'లో సమస్యలు పరిష్కారమైనట్లు చూపడం తగదు

ప్రజాశక్తి-కోడూరు : రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సమస్యలు పరిష్కరించకుండా సమస్య పరిష్కారమైం దంటూ మెసేజ్లు పంపిస్తూ రైతులను అవమాన పరుస్తున్నారని కోడూరు మండల రైతు సంఘం నాయకులు ఆవుల బసవయ్య ఆరోపించారు. శుక్రవారం కోడూరులోని రైతు సంఘం కార్యాలయం వద్ద పాత్రికేయులతో మాట్లాడుతూ ఇరాలి గ్రామం వద్ద రత్నకోడు మేజర్ డ్రైన్ నుంచి న్యూ ఇరాలి డ్రైన్ లోకి అక్రమంగా వేసిన తూమ్ములు తొలగించాలని, దానివల్ల వేలాది ఎకరాలు పంట పొలాలు ముంపుకు గురవుతున్నాయని, జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఇప్పటికి మూడుసార్లు అర్జీ ఇచ్చినప్పటికీ కనీసం సమస్య పరిష్కరించడానికి అధికారులు పరిశీలన కూడా చేయకుండా సమస్య పరిష్కారమైందంటూ మెసేజ్లు పంపారన్నారు. రెవెన్యూ అధికారులు మెట్ట భూములను



సమస్య పరిష్కారమైనట్లు పంపించిన కాగితాలు

మాగాణి భూములుగా మార్చి అడంగల్ లో పేర్లు మార్చారని, గ్రామ రెవెన్యూ సదస్సులో రైతుల పట్టా భూములను, ఎటువంటి నోటీసులో ఇవ్వకుండా నిషేధిత జాబితాలో చేర్చారని అర్జీ ఇస్తే నెలల తరబడి పరిష్కారానికి అర్జీలోని తేదీలు మారుస్తున్నారే తప్ప అవి పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. జిల్లా కలెక్టర్ దష్టికి తీసుకువెళ్లిన సమస్యలపై స్పందన ఇలా ఉంటే ఇంకా రైతుల సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని, రైతులను ఇలా అవమానించడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నేతలు రేపల్లె యోగ ప్రకాష్, చెక్కా మోహనరావు, జొన్నలగడ్డ గోపాలరావు, పోనమాల కోటయ్య తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు వికెఆర్ కళాశాల విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-గన్నవరం : రాష్ట్ర స్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య అండర్ 19 ఫెన్సింగ్ పోటీలకు గన్నవరం మండలం కేసరపల్లి వేములపల్లి కోదండ రామయ్య కళాశాల (వి.కే.ఆర్.సి) కు చెందిన ఇద్దరు విధార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డి. శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. విజయవాడలోని కష్ణ లంక జూనియర్ కళాశాలలో జరిగిన జిల్లా స్థాయి ఫెన్సింగ్ ఎంపికలకు హాజరైన ద్వితీయ సంవత్సరం ఎం పి.సి చదువుతున్న ఏ. రెహాన్, సి.ఇ.సి చదువుతున్న పి. దుష్యంత్లు క్రీడలో అసమాన నైపుణ్యం ప్రదర్శించడంతో సెలక్షన్ కమిటీ వీరిరువురిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. త్వరలో గుంటూరు లో జరుగబోయే ఆంధ్రప్రదేశ్ అంతర జిల్లాల పాఠశాల క్రీడా సమాఖ్య అండర్ 19 ఫెన్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీలకు రెహాన్, దుష్యంత్ కష్ణా జిల్లా ఫెన్సింగ్ జట్టు తరపున ప్రాతినిధ్యం వహిస్తారని ఆయన తెలిపారు.

రోటరీ యువజనోత్సవాల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - గుడివాడ : స్థానిక శ్రీరాంపురం లోని రోటరీ భవనంలో గత పది రోజులుగా రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ నిర్వహిస్తున్న పలు ప్రతిభా పోటీలలో తమ స్కూల్ విద్యార్థులు అనేక పతకాలు సాధించినట్లు విద్యాలయ పాఠశాల డైరెక్టర్ బొప్పన విజయ భాస్కర్ తెలిపారు. శుక్రవారం స్థానిక రాజేంద్రనగర్లోని విద్యాలయలో ప్రతిభా పోటిలలోని విజేతలను అభినందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. బృంద నృత్య విభాగంలో 9 మంది విద్యార్థులు సభావత్తుల శ్రీనిధి, ఓగిరాల గీతిక, మోతుకూరి రిషిత, తెల్ల హెన్రిత, భూపతి జోషిత, కమ్మెల చైత్రిక, చిరుమామిల్లి లాస్య, కామరాజుగడ్డ వినయశ్రీ, జెస్సికాలతో పాటు మరో 20 మంది విద్యార్థులు బహుమతులు సాధించడం అభినందనీయమన్నారు. అలాగే డా।।కెకెఆర్ గౌతమ్ విద్యార్థులు వ్యాసరచన పోటిలలో పలు పతకాలు సాధించినట్లు స్కూల్ ప్రిన్సిపల్స్ ఎం.సత్యరామ్, పి.లక్ష్మీప్రసాద్, కె.జ్యోతి, ప్రశాంతిలు తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు 30 మంది బహుమతులు సాధించడం అభినందనీ యమన్నారు. అలాగే స్థానిక రాజేంద్రనగర్లోని విశ్వ భారతి ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థులు బహుతులు సాధించారు. 50 మంది విద్యార్థులు బహుమ తులు సాధించారని పాఠశాల ఛైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ చెప్పారు. అలాగే స్థానిక బైపాస్ రోడ్డులోని విద్యావికాస్ ఇంగ్లీషు మీడియం స్కూల్కు చెందిన విద్యార్థులు బహుమతులు సాధిం చారు. వీరిని పాఠశాల డైరెక్టర్ కొమ్మినేని సాంబశివరావు, పాఠశాల హెచ్ఎం చాట్రగడ్డ నాగమల్లేశ్వరరావు అభినందించారు.



విద్యావికాస్ విద్యార్థులు



విద్యాలయ విద్యార్థులు



కెకెఆర్ గౌతమ్ విద్యార్థులు



విశ్వభారతి విద్యార్థులు

పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో 'సదా మీ సేవలో' ప్రారంభం

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : మచిలీపట్నం డివిజన్ పరిధిలో ప్రజలకు పారదర్శకమైన పోస్టల్ సేవలను అందించే ఉద్దేశంతో సదా మీ సేవలో అనే కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్ లో మొట్టమొదటిసారిగా మచిలీపట్నంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని శుక్రవారం ముఖ్యఅతిథి పోస్టల్ సూపరింటెండెంట్ బి. శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి లోగో పోస్టర్ను ఆవిష్కరించారు. అనంతరం పోస్టల్ సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశంలో పాల్గొని కార్యక్రమం కార్యాచరణను సిబ్బందికి వివరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి పోస్టల్ సేవల పట్ల ఫిర్యాదులు ఉన్న చరవాణి ద్వారా 7989995256 నంబర్కి ఫోన్ చేసి ఫిర్యాదులను పరిష్కరించుకోవచ్చని, ప్రతి సోమవారం సాయంత్రం నాలుగు గంటల నుండి ఐదు గంటల వరకు నేరుగా పోస్టల్ ఎస్పీని నేరుగా కలిసి తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం సబ్ డివిజన్ పోస్టల్ ఇన్స్పెక్టర్ కె.వి.కిరణ్ కుమార్, మచిలీపట్నం పోస్టుమాస్టర్ జి.అంజి బాబు,పాల్గొన్నారు.

పోషకాహార వంట పోటీలు



ప్రజాశక్తి-నందివాడ : మండలంలోని జనార్థనపురం అంగన్వాడి కేంద్రంలో పోషణ మహాలో భాగంగా పురుషుల భాగస్వామ్యం తండ్రుల ఆధ్వర్యంలో పోషకాహార వంటల పోటీలు నిర్వహించినట్లు ఐసిడిఎస్ సూపర్వైజర్ బికెడి భవాని తెలిపారు . తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన. ఆహారాన్ని ఎలా తయారు చేసుకోవాలి చేసి చూపించారు. అంగన్వాడి కార్యకర్తలు ఆదిలక్ష్మి, అఖిల, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు రుణాలివ్వాలి

ప్రజాశక్తి-పమిడిముక్కల : కౌలు రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించాలని జిల్లా రైతు సంఘం సభ్యులు కొల్లి వెంకట రామయ్య అన్నారు. శుక్రవారం పమిడిముక్కల మండలంలోని వీరంకిలాకులలో ఆయన మాట్లాడుతూ కౌలు రైతులు రుణాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారికి బ్యాంకుల ద్వారా రుణాలిచ్చి ఆదుకోవాలన్నారు. అలాగే యూరియా అందక కూడా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, యూరియా అందించి పంటను కాపాడాలన్నారు. అలాగే వరి ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. రైతు సేవా కేంద్రాల్లో సిబ్బంది కొరకు లేకుండా చూడాలని కోరారు.

పెనమకూరులో ఆక్రమణలు తొలగింపు

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : మండలంలోని పెనమకూరు పంచాయతీ పరిధిలో ఉన్న ఆక్రమణలను తొలగించి డ్రైనేజీ నిర్మిస్తున్నామని పంచాయతీ కార్యదర్శి బి. వెంకటేశ్వరరావు తెలిపారు. గ్రామంలో ప్రధాన రహదారి నుంచి బీసీ కాలనీలోకి, దళితవాడలోకి వెళ్లే రోడ్లకు ఇరువైపులా ఆక్రమణలు జరిగాయని వీటిని విడగొట్టి డ్రైనేజీ నిర్మిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా శనివారం జెసిబి మిషన్తో గ్రామాల్లోని రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్తను, మురుగును, ఆక్రమణలను తొలగించారు.

ఎఎన్ఎం అండ్ వివిఆర్ఎస్ఆర్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : రోటరీ క్లబ్ గుడివాడ వారు ఈ నెల 3వ తేదీ నుండి 18 వరకు నిర్వహించిన యూత్ ఫెస్టివల్లో భాగంగా వివిధ విభాగాలకు సంబంధించిన పోటీలు నిర్వహించారు. స్థానిక ఎ.ఎన్.ఎం అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్ గుడ్లవల్లేరు ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థులు శాస్త్రీయ నత్యం లో ప్రథమ బహుమతి, తెలుగు వ్యాసరచన ,సీనియర్ ఫ్యాన్సీ డ్రెస్, జూనియర్స్ శాస్త్రీయ నత్యం, సీనియర్ ఫోక్ డాన్స్ లలో ద్వితీయ స్థానం, ఇంగ్లీష్, తెలుగు వక్తృత్వంలో తృతీయ స్థానం, స్పాట్ పెయింటింగ్, సీనియర్స్ ఫ్యాన్సీ డ్రెస్సులు లలో కన్సోలేషన్ ప్రైజ్ లు కైవసం చేసుకున్నారు. బహుమతులు సాధించిన విద్యార్థులను వారికి శిక్షణను ఇచ్చిన ఉపాధ్యాయులను స్కూల్ ప్రిన్సిపల్ కుజుమన్, డైరెక్టర్ ఎన్ .శ్రీనివాసమూర్తిలు అభినందించారు

ప్రజాశక్తి
www.prajasakti.com
కృష్ణాజిల్లా
శనివారం
20 సెప్టెంబరు 2025

ఆకట్టుకున్న దసరా సాంస్కృతికోత్సవాలు












బహుమతులు అందిస్తున్న దృశ్యం





ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన దసరా సాంస్కృతికోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. రెండవ రోజు శుక్రవారం ఉత్సవాలు నగరంలోని ఎంబి భవన్‌లో జరిగాయి. శాస్త్రీయ నత్యాలు, జానపద నృత్యాలు, వెస్టన్ నత్యాలు, అభ్యుదయ గీతాలు, లఘు నాటిక, అంశాలలో పోటీలు జరిగాయి. నవ దుర్గలు పేరుతో నిర్వహించిన నృత్య నీరాజనం కార్యక్రమంలో విద్యార్థి పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సందడిగా ప్రాంగణం : దసరా సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహిస్తున్న మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం అంతా శు క్రవారం ఉదయంవిద్యార్థులు, మహిళలతో సందడిగా ఉంది. ఇటీవల కాలంలో నగరంలో ఎక్కడా సాంస్కృతిక కార్యక్రమాలు పెద్ద సంఖ్యలో జరుగలేదు. దీనితో ఇక్కడ జరుగుతున్న పోటీలను తిలకించడానికి స్థానికులు, కళాశాల యువత పెద్ద సంఖ్యలో హాజరుకావడంతో ప్రాంగణం అంతా సందడిగా కనిపించింది.

నువ్వు...నేనా... : శుక్రవారం జరిగిన పోటీలలో శాస్త్రీయ నృత్యాలు, జానపద నృత్యాలు పోటీలలో విద్యార్థులు పల్లె సంస్కృతితో పాటు ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న అంశాలపై నృత్యాలను చేశారు. ముఖ్యంగా కళాశాల యువత పోటీలలో పాల్గొనడంతో పాటు ప్రదర్శించడంలో ఒకరికొకరు పోటీపడ్డారు.






















8వ వేతన సంఘాన్ని నియమించాలి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కేంద్ర ప్రభుత్వం 8వ వేతన సంఘాన్ని నియమించాలని డిమాండ్ చేస్తూ సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం గుంటుపల్లిలోని వ్యాగన్ వర్క్ షాపు మెయిన్ గేట్ వద్ద కార్మికులు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ బ్రాంచి కార్యదర్శి ఎమ్‌విఎమ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. వేతన సంఘాన్ని వెంటనే ప్రకటించి, జనవరి 2026 నుండి అమలు చేసి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భవిష్యత్ కార్యాచరణతో కార్మికులు దేనికైనా సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ చైర్మన్ తమ్మా సుబ్బారెడ్డి, ట్రెజరర్ కె సురేష్, అసిస్టెంట్ డివిజన్ సెక్రటరీ కె రామయ్య, జోనల్ వర్కింగ్ కమిటీ మెంబెర్ అక్కాల శ్రీనివాసరావు, అసిస్టెంట్ సెక్రటరీ చిలక ఆనంద్, డి.బాబు, పాల్గొన్నారు.



వర్క్‌షాపు వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

మానవ హక్కుల సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా అప్పారావు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం దావాజీగూడెం గ్రామానికి చెందిన ధనియాల అప్పారావు హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (హెచ్‌ఆర్‌ఏజె)రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా నియమితులయ్యారు. శుక్రవారం విజయవాడలో జాతీయ అధ్యకుడు నందం నరసింహారావు ఆయనకు నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా అప్పారావు మీడియాతో మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన ప్రజ సమస్యలను ఎప్పటికప్పుడు తనపై నాయకుల తెలిపి సత్వరమే పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- నందిగామ : వంట మేస్త్రీలు, కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నందిగామ సుందరయ్య భవనంలో సీతా రామాంజనేయ వంట పనివార్ల సంఘం (సిఐటియు) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, సిఐటియు జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ మాట్లాడుతూ వంట మేస్త్రిలకు, కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, కనీస వేతనాలు నిర్ణయించాలని, ప్రమాదంలో గాయపడినా, మరణించినా నష్ట పరిహార సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో సీతా రామాంజనేయ వంట పని వార్ల సంఘం నందిగామ అధ్యక్షుడు ఎం మౌళి, కార్యదర్శి ముటాల లక్ష్మీ నారాయణ, కోశాధికారి గోపు రామాంజనేయులు (అంజి), ఉపాధ్యక్షులు కె. రామకష్ణ, కె. సురేష్, కె. దేవి పాల్గొన్నారు.

పే స్కేల్ అమలు కోరుతూ వీఆర్ఎల ధర్నా



ప్రజాశక్తి- గంపలగూడెం: తమ సమస్యలను పరిష్కరించాలని వీఆర్ఏలు శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పేస్కేల్ అమలు చేయాలని, పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో నాయకులు ముచ్చింతల రాంబాబు, మోదుగు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

డ్వామా ఎపిడిగా లక్ష్మీకుమారి బాధ్యతల స్వీకరణ



ప్రజాశక్తి- నందిగామ : నందిగామ డ్వామా ఎపిడిగా బిఎం లక్ష్మీ కుమారి శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. కంచికచర్ల ఎంపీడీవోగా పనిచేస్తున్న లక్ష్మీ కుమారి పదోన్నతుల్లో భాగంగా నందిగామ ఏపీడిగా ప్రమోషన్ పొందారు. ఇప్పటి వరకు నందిగామ ఇంచార్జ్ ఏపీడిగా శ్రీనివాస్ పనిచేశారు. లక్ష్మీ కుమారి కంచికచర్ల ఎంపీడీవోగా పని చేసిన కొద్ది కాలంలోనే సమర్థవంతమైన అధికారిగా పేరు తెచ్చుకున్నారు.

సిద్ధార్థలో మ్యూజ్ క్రేజ్ పోటీలు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : మదన్ మోహన్ మాలవ్యా 1916లో కాశీలో బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం నెలకొల్పిన నేపథ్యాన్ని.. 1975లో మొదలైన సిద్ధార్థ విద్యా సంస్థల ప్రస్థానం గుర్తు చేస్తోందని కృష్ణా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్. ఉష అన్నారు. సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో మ్యూజ్ క్రేజ్ పేరుతో ఏర్పాటు చేసిన సాహిత్య కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. సభకు అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ మాట్లాడుతూ తమ కళాశాల పూర్వ ఆంగ్ల విభాగాధిపతి, సుప్రసిద్ధ కవి వేగుంట మోహన్ ప్రసాద్, విశ్రాంత తెలుగుశాఖాధిపతి, సిద్ధార్థ కళాపీఠం పూర్వ కార్యదర్శి నాగళ్ళ గురుప్రసాద్ తమ కళాశాలలో గొప్ప సాహిత్య వాతావరణం పాదుకొల్పారంటూ నివాళులర్పించారు. కళాశాల కన్వీనర్ నిమ్మగడ్డ లలిత ప్రసాద్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పుస్తక పఠనం అలవర్చుకోవాలన్నారు. విద్యార్థులలో సృజనను వెలికి తీయడానికి వ్యాస రచన, వక్తృత్వం, పోస్టర్, స్కిట్ తదితర పోటీలను నిర్వహిస్తూ బహుమతులు ఇస్తున్నట్లు ఇంగ్లిష్ విభాగాధిపతి శ్రీలలిత చెప్పారు.

డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : నిమ్రా ఫార్మసీ కళాశాలలో ఈగల్ టీం ఆధ్వర్యంలో శుక్రవారం డ్రగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈగల్ టీం సిఐ రవీంద్ర మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థులు ఫార్మసీలలో ఉద్యోగం చేసేటప్పుడు ప్రిస్క్రిప్షన్ లేనిదే ఎన్‌ఆర్‌ఎక్స్ డ్రగ్స్ విక్రయించకూడదని తెలిపారు. వివిధ డ్రగ్స్ తయారు కంపెనీలలో పనిచేసేటప్పుడు సింథటిక్ డ్రగ్స్ గురించి వారి దృష్టికి వస్తే ఈగల్ కాల్ సెంటర్‌కి సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎ కృష్ణ మాట్లాడుతూ సమాజంలో ఫార్మసిస్ట్ ప్రాముఖ్యతను వివరిస్తూ.. వారు డ్రగ్స్ భారిన పడకూడదదని తెలిపారు. ఎస్ఐ వీరాంజనేయులు మాట్లాడుతూ డ్రగ్స్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని కోరారు.

మహిళలకు కేన్సర్ పరీక్షలు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : మండల పరిధిలోని కూనపరాజుపర్వ గ్రామంలో రెండు సచివాలయంల పరిధిలో "స్వస్థ నారి సశక్తి పరివార్ అభియాన్" కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో మహిళలకు, కిషోర బాలికలకు రక్తపరీక్షలు, కేన్సర్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాతంగి వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు బండారు వెంకటేశ్వరరావు, రాయుడు, వెంకటేశ్వరరావు, గిరిజాల సురేష్, తస్నీరు సాంబశివరావు, రెడ్డిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కీర్తి, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్ర ఆర్థిక విధానాలను వ్యతిరేకించాలి

ప్రజాశక్తి- నందిగామ : దేశంలో ప్రధాని నరేంద్ర మోడీ అనుసరిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలను తక్షణమే అరికట్టాలని సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, కోట కళ్యాణ్ పిలుపునిచ్చారు. సిపిఎం నందిగామ నియోజకవర్గ సభ్యుల సమావేశం స్థానిక సుందరయ్య భవనంలో శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. రైతులకు యూరియా పంపిణీ చేయకుండా కేన్సర్ వస్తుందని ప్రచారం చేయడం సరికాదన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ప్రజా సమస్యలపై గట్టిగా పోరాడాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌సిహెచ్ శ్రీనివాస్

ఈ సమావేశంలో సిపిఎం నందిగామ కార్యదర్శి కటారపు గోపాల్, వీరులపాడు సిపిఎం కార్యదర్శి చాట్ల రవి, సభ్యులు పిచ్చేశ్వరరావు, సయ్యద్ ఖాసిం, గోపి నాయిక్, లాజరు, హుస్సేన్, విఠల్, లాజరు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - తిరువూరు : తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటీయూ) ఆధ్వర్యంలో పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు శుక్రవారం తిరువూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు బలగాని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 12వ పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలి, మున్సిపల్ కార్మికులందరికీ పిఆర్‌సి జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు నాగరాజు, కరీం పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సిఎం సహాయ నిధి నుండి నిధులు మంజూరయ్యాయి. దీంతో బాధితులకు రెడ్డిగూడెం మండల కేంద్రంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను నాయకులు ముప్పిడి నాగేశ్వరరెడ్డి, వేణుగోపాలరెడ్డి, కూటమి నాయకులు పంపిణీ చేశారు. ఆపదలో ఉన్న వారికి ఈ సహాయం ఎంతో ఉపయోగ పడుతుందని వారు తెలిపారు.

కేశినేనిని విమర్శించే స్థాయి పేర్నికి లేదు : టిడిపి

ప్రజాశక్తి-విస్సన్నపేట
కేశినేని చిన్నిని విమర్శించే స్థాయి పేర్నికి లేదని టిడిపి విస్సన్నపేట మండల అధ్యక్షులు రాయల సుబ్బారావు అన్నారు. విస్సన్నపేటలోని టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రేషన్ బియ్యాన్ని అక్రమంగా అమ్ముకున్న సంగతి, గతంలో బాలసౌరిపై చేసిన కుట్రల గురించి అందరికీ తెలుసన్నారు. కేశినేని చిన్ని ఎంతోమంది నిరుద్యోగులకు జాబ్ మేళా ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని, మెడికల్ క్యాంపులు నిర్వహిస్తూ నిరుపేదలకు వైద్యం అందిస్తున్నారని తెలిపారు. అలాంటి వ్యక్తిపై అవాకులు చవాకులు పేలితే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోటేటి సుబ్రహ్మణ్యేశ్వరరావు (బుడ్డియ్య), నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గొట్టుముక్కలలో ఆరోగ్య పరీక్షలు

ప్రజాశక్తి-కంచికచర్ల
కంచికచర్ల మండలం గొట్టుముక్కల గ్రామంలో శుక్రవారం "స్వస్థ్ నారి సశక్తి పరివార్ అభియాన్" కార్యక్రమంలో మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. నిర్వహించిన వైద్య శిబిరంలో పిహెచ్‌సి ఇన్‌ఛార్జ్ అధికారి రవి కిరణ్, వైద్యాధికారి పరీక్షించి ఆరోగ్య సలహాలు చెప్పారు. రక్త పరీక్షలు నిర్వహించారు. వివిధ రకాల కేన్సర్ల లక్షణాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజ్ కుమార్, ఉప సర్పంచ్ గోగినేని అమర్నాథ్, గ్రామ కార్యదర్శి సిహెచ్ వనిత, సూపర్వైజర్ చంద్రశేఖర్, పాల్గొన్నారు.



సిద్ధార్థలో జాబ్ మేళా

ప్రజాశక్తి-విస్సన్నపేట
విస్సన్నపేట స్థానిక సిద్ధార్థ (విజ్ఞాన్) డిగ్రీ కళాశాలలో శుక్రవారం దివిస్ ల్యాబ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాలో 70 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో ఏడుగురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కాలేజీ చైర్మన్ మేడ మోహనరావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టీ సత్యనారాయణ, కరస్పాండెంట్ ఎం సత్యనారాయణ, పీజీ కాలేజ్ వెంకటరెడ్డి అభినందించారు.

సుందరయ్యనగర్ కట్ట విస్తరణ పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-విజయవాడ
సుందరయ్య నగర్ కట్ట విస్తర్ణ పనులు శరవేగంగా జరగాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. అజిత్ సింగ్ నగర్, పైపుల రోడ్డు, సుందరయ్య నగర్ కట్ట, ధర్నా చౌక్ తదితర ప్రాంతాలను కమిషనర్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సుందరయ్య నగర్ కట్ట విస్తర్ణ పనులు శరవేగంగా జరగాలని, మాస్టర్ ప్లాన్ ప్రకారం ప్రస్తుతం ఉన్న 60 అడుగుల రోడ్డును 80 అడుగుల రోడ్డుగా మారుస్తున్న సందర్భంగా 20 అడుగుల విస్తీర్ణానికి గుర్తి 240 ఇళ్ల నివేదికను రెవెన్యూ శాఖకి సమర్పించాలని, వెరిఫికేషన్ తర్వాత రెవెన్యూ శాఖ నుండి వచ్చే జాబితా ఆధారంగా ఇళ్లను కేటాయించాలని అధికారులను ఆదేశించారు. ధర్నా చౌక్ వద్ద గల అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. ఈ పర్యటనలో చీఫ్ సిటీ ప్లానర్ కె సంజయ్ రత్నకుమార్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : పట్టణంలోని మండవ ఇంజనీరింగ్ కళాశాలలో నందిగామ ఏసిపి తిలక్ ఆధ్వర్యంలో శక్తి యాప్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోక్సో, సైబర్ క్రైమ్, మత్తు మందులు వాడకంపై విద్యార్థులకు శక్తి టీమ్ ఎఎస్ఐ హనుమయ్య అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి-వత్సవాయి : పెనుగంచిప్రోలులోని శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానానికి విజయవాడ మొగలరాజపురంకు చెందిన సూర్యదేవర బాలకృష్ణరావు మెక్ ఇంజనీర్స్ ఎరెక్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ పేరుతో నిత్యాన్నదానానికి రూ.1,01,116లను విరాళంగా అందజేశారు. విరాళాన్ని ఆలయ ఎఇఒ జంగం శ్రీనివాసరావుకు శుక్రవారం అందజేశారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

ఉద్యోగులకు సంబంధించిన సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డికె బాలాజీ జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని మీకోసం సమావేశ హాలులో ఎంప్లాయిస్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించి పలువురు ఉద్యోగుల నుండి ఆయన స్వయంగా అర్జీలు స్వీకరించారు. ఉద్యోగుల వివిధ సమస్యలను ఓపిగ్గా ఆలకించి ఆయన కొన్నిటిని అక్కడికక్కడే పరిష్కరించారు. మొత్తం 21 దరఖాస్తులు రాగా, వాటిని సంబంధిత అధికారులకు పంపిస్తున్నామని వాటిని సకాలంలో పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో కే చంద్రశేఖరరావు, జెడ్పీ సీఈవో కన్నమనాయుడు, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఉద్యోగుల నుండి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

విద్యార్థుల ఇండస్ట్రియల్ విజిట్

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :మండలంలోని కవుతరం కానూరి దామోదరయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9, 10 విద్యార్థులు, ఇంటర్మీడియట్ ఎలా ట్రానిక్స్, ఒకేషనల్ చదువుతున్న విద్యార్థులకు శనివారం ఇండస్ట్రియల్ విజిట్ నిర్వహించారు. గుడ్లవల్లేరు ఏ ఏ ఎన్ ఎం అండ్ వివిఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ కళాశాలలోను సందర్శించారు. కళాశాలలో జరుగుతున్న సాంకేతిక విధానాన్ని తెలుసుకున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎన్ రజనీకుమారి, ఆర్ బాబీ కుమార్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధికి కులాల మధ్య చిచ్చు తగదు

ప్రజాశక్తి-పామర్రు : ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పని తీరును ఓర్చుకోలేక కులాల మధ్య చిచ్చు పెడుతూ రాజకీయ లబ్ధి పొందాలని మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ చూస్తున్నారని పామర్రు నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ తాడిశెట్టి నరేష్ అన్నారు. తన కార్యాలయంలో నరేష్ మాట్లాడుతూ తన కుటుంబం వ్యాపారం చేస్తూ ప్రజలతో మమేకమై ఉన్నామన్నారు. ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా విలువలతో కూడిన రాజకీయం చేస్తున్నారని, ఆయన రేషన్ బియ్యం బొక్కాడని మాట్లాడుతున్నారని, ఆయన అవినీతి నిజమైతే నిరూపించాలన్నారు.

సురేష్ బాబుకు అవార్డు అందజేత

ప్రజాశక్తి-చల్లపల్లి :తెలంగాణకు చెందిన ఫ్రెండ్ చిప్ మినిస్ట్రీ ఆధ్వర్యంలో వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించిన వ్యక్తులకు ఇచ్చే డా.దాసరి నారాయణరావు స్మారక అవార్డును చల్లపల్లికి చెందిన ఎన్జీ ఎన్జీ ఎంప్లాయిస్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్ బాబుకు అందించారు. శనివారం హైదరాబాద్ హిమాయత్ నగర్ లో జరిగిన కార్యక్రమంలో మ్యాన్ ఆఫ్ హ్యూమన్ టీ అండ్ ఎక్స్ లెన్స్ ను 2025 అవార్డును సురేష్ బాబుకు అందించి సన్మానించారు. ఉద్యోగ సంఘ నేతగా, సామాజిక సమస్యల పరిష్కారానికి చేస్తున్న కృషి చేస్తున్న నేపథ్యంలో విశిష్ట అతిథిగా ఆహ్వానించి అవార్డుతో సత్కరించారు.

మున్సిపల్ కార్మికులకు పిఆర్సి అమలు చేయాలి

ప్రజాశక్తి-ఉయ్యూరు : మున్సి పల్ కార్మికులకు పిఆర్సిని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని సిఐటియు ఉయ్యూరు మండల కన్వీనర్ బి రాజేష్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్మికులు నగర పంచాయతీ కార్యాలయం ముందు గాంధీ విగ్రహానికి అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ అరకొర వేతనాలతో మున్సిపల్ కార్మికుల జీవనం అస్తవ్యస్తంగా మారిందని ఆరోపించారు. 12వ పి.ఆర్.సిని ప్రభుత్వం ప్రకటించి కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని అన్నారు. కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేసి ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్ సీనియర్ నాయకులు డిఅమదయ్య బి శంకర్ డి దుర్గమ్మ వీరమ్మ సత్యవతి చిన్నోడు తదితరులు పాల్గొన్నారు.



మత్స్యకారులకు సబ్సిడీ కార్డులు అందజేత

ప్రజాశక్తి-అవనిగడ్డ : కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు అన్ని రకాలుగా చేయూత నందిస్తుందని నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ తెలిపారు. శుక్రవారం అవనిగడ్డ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో నాగాయలంక, కోడూరు మండలాల పరిధిలోని తీర గ్రామాలకు చెందిన మత్స్యకారులకు వేట ఇంజన్ నావలు నడిపే 44 మందికి హైస్పీడ్ డీజిల్ సబ్సిడీ కార్డులు పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకట్రాం మాట్లాడుతూ హెచ్ఎస్డి సబ్సిడీ కార్డుల ద్వారా వేటకు వెళ్లే మత్స్యకారులకు ఇంజన్ నావలకు నెలకు 300 లీటర్ల డీజిల్ కొనుగోలుక ప్రతి లీటర్కు తొమ్మిది రూపాయల సబ్సిడీ లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార జిల్లా కో-ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ కర్రి కృష్ణమూర్తి, పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల దీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్

సమస్యలు పరిష్కరించాలని మచిలీ పట్నంలోని డిఈ కార్యాలయం ముందు విద్యుత్ శాఖ సిబ్బంది రిలే నిరాహార దీక్షలు శుక్రవారం ప్రారంభించారు. విద్యుత్ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగుల ఉమ్మడి కార్యాచరణ వేదిక నేతృత్వంలో మచిలీపట్నం జేఏసీ నాయకులు బొర్రా శ్రీనివాసరావు, కన్వీనర్ వి అంకబాబు ఉద్యోగులతో కలిసి ఉమ్మడిగా ఆందోళన చేపట్టారు. 2004కు ముందు కాంట్రాక్టు పద్ధతిలో ప్రవేశించిన ఉద్యోగులందరికీ జిపిఎఫ్ వర్తింప చేయాలని, విద్యుత్తు లైనుల నిర్వహణ, సరఫరా పంపిణీ పనులు కూడా ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పాలని ఆందోళనలో పాల్గొన్న నాయకులు తెలిపారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు ఆత్మూరి చంద్ర ధర్మారావు, రిటైర్డ్ ఫోర్ మెన్ బి శ్రీనివాసరావు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.





'వికాస్'లో అంతర్జాతీయ సదస్సు ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ రూరల్ : విజయవాడ రూరల్ మండలం నున్నలోని వికాస్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్లో నిర్వహించబడుతున్న మొదటి అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ప్రారంభ సమావేశంలో సదస్సు కన్వీనర్ డాక్టర్ పి.వి.ఎల్.ఎన్. ఫణి మాట్లాడుతూ ఈ సదస్సుకు దేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు అమెరికా నుంచి కూడా మొత్తం 328 పరిశోధనా పత్రాలు అందగా, వాటిలో కేవలం 112 పత్రాలు మాత్రమే ఎంపిక చేసి ప్రదర్శనకు ఆమోదించబడ్డాయని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.ఎస్. శ్రీనివాస్ మాట్లాడుతూ అధ్యాపకులు, విద్యార్థులలో పరిశోధనాసక్తిని పెంపొందించే దిశగా కళాశాల ఎల్లప్పుడూ కృషి చేస్తుందని తెలిపారు. కార్యదర్శి ఎన్. సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ "ప్రతి సంవత్సరం ఇలాంటి అంతర్జాతీయ సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ఎడిటోరియల్ బోర్డు సభ్యుడు డాక్టర్ రాజా సంతోష్ పరిశోధనా పత్రాల పరిశీలన, సమీక్ష విధానం వివరించారు. విట్ అమరావతికి చెందిన ప్రొఫెసర్ అనిల్ విట్టల్ రావు, ప్రధానోపన్యాసంలో డేటా ఇంజినీరింగ్లో వస్తున్న కొత్త ఆవిష్కరణలు, డేటా భద్రత ప్రాముఖ్యతపై ప్రసంగించారు. నిట్ వరంగల్కు చెందిన ప్రొఫెసర్ అంబా ప్రసాదరావు, ముఖ్య ప్రధానోపన్యాసంలో "అల్టర్నేట్ ఫ్యూయల్స్ -ది ఎమర్జింగ్ ట్రెండ్స్" అనే అంశంపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు.

శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణించేందుకు పోటీ పరీక్షలు

ప్రజాశక్తి-గన్నవరం :శాస్త్ర సాంకేతిక రంగాలలో విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని వివిఎం జిల్లా కోఆర్డినేటర్ పి జగతి కోరారు. శుక్రవారం గన్నవరం సెయింట్ జోన్స్ స్కూల్లో పోటీ పరీక్ష బ్రోచర్లను ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థి విజ్ఞాన మంథన్ అనేది జాతీయస్థాయి విజ్ఞాన ప్రతిభాశోధన పరీక్ష విజ్ఞాన భారతి, జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి, విద్యా మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వం జాతీయ విజ్ఞాన సంగ్రహాలయ మండలి సాంస్కృతిక మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వం సంయుక్తంగా పోటీ పరీక్ష ప్రోగ్రాం నిర్వహిస్తుందని చెప్పారు. 6 వ తరగతి నుండి 11వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులలో విజ్ఞాన పటిమను గుర్తించి అభివృద్ధి చేయడానికి దోహదపడుతుందన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి : జెడి శీలం

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్

కేంద్ర మాజీ మంత్రి, ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జెడి శీలం శుక్రవారం మచిలీపట్నంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి విచ్చేసి జిల్లా స్థాయి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడి శీలం మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ పట్ల రాహుల్ గాంధీ పట్ల సానుకూల వాతావరణం ఏర్పడిందని ఓటు చోర్ గద్ది చోడ్ కార్యక్రమంలో భాగంగా బీహార్లో అప్రతిహతంగా కాంగ్రెస్ ఆర్జెడి దూసుకుపోతున్నాయని అన్నారు. బీహార్ ఎన్నికల అనంతరం దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ బాగా పుంజుకుంటుందని ప్రతి కార్యకర్త ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే దిశగా ముందుకు సాగాలని కోరారు. మండల స్థాయి నాయకులు గ్రామస్థాయి నాయకులను నియమించి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి అన్ని కమిటీలను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి మార్నేడి బాబ్జీ, పెనమలూరు కోఆర్డినేటర్ ధనేకుల మురళి మోహన్ రావు, పామర్రు కోఆర్డినేటర్ మొవ్వ మోహన్ రావు, ఓబీసీ సెల్ స్టేట్ చైర్మన్ నాగరాజు పాల్గొన్నారు.

స్కిల్ హబ్లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-గన్నవరం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ హబ్ ద్వారా గన్నవరం లోని గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల నందు నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ వి.వి. ఎస్. కృష్ణ మోహన్ శుక్రవారం తెలిపారు. గన్నవరం పాలిటెక్నిక్ కళాశాల లోని స్కిల్ హబ్ లో ఆఫీస్ అసిస్టెంట్ కోర్సుపై ఉచిత శిక్షణ ఇస్తామని, వచ్చే నెలలో శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. నిపుణుల ద్వారా శిక్షణ ఇచ్చి స్థానికంగా ఉన్నటువంటి పరిశ్రమలలో ఉపాధి అవకాశాలను కల్పిస్తామన్నారు. ఆసక్తి ఉన్నటువంటి యువతీ, యువకులు ఈ కోర్సును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కోర్సుకు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ చదివిన నిరుద్యోగ యువతి యువకులు అర్హులని, పూర్తి వివరాలకు 9494005725 నెంబర్ను సంప్రదించి తమ వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలకు అర్హులైన విద్యార్థుల వివరాలను జ్ఞానభూమి కళాశాల లాగిన్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సాంఘిక సంక్షేమశాఖ ఉపసంచాలకులు షాహిద్ బాబు షేక్ తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన పోస్టు మెట్రిక్ స్కాలర్షిప్ కు అర్హులైన విద్యార్థుల వివరాలను జ్ఞానభూమి పోర్టల్లో కళాశాల లాగిన్ ద్వారా నమోదు చేసుకునే అవకాశం కల్పించామన్నారు. ఈ పోస్టు మెట్రిక్ స్కాలర్షిప్ కు ఫ్రెష్ మరియు రిన్యూవల్ విద్యార్థుల రిజిస్ట్రేషన్ను ఈ నెల 30వ తేదీ లోగా పూర్తి చేయాలని సూచించారు. అలాగే ఆయా కళాశాలల ప్రధానాచార్యులు తమ కళాశాలల విద్యార్థుల వివరాలను సమర్థవంతంగా ఓటీపీ ONE TIME AUTHENTICATION ద్వారా ధృవీకరించి జిల్లా లాగిన్ కి ఫార్వర్డ్ చేయాలన్నారు.

ఎస్సి ఉపకులాల కార్పొరేషన్లకు నిధులు కేటాయించాలని వినతి

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ఎస్సీ ఉప కులాల కార్పొరేషన్లకు ప్రభుత్వం నిధులు కేటాయించాలని మండల ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం తాసిల్దార్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కొడమల గంగాధర్ మాదిగ, కంచర్ల సుధాకర్ మాదిగ, వర్ల పోగు పోలయ్య, నియోజకవర్గం అధ్యక్షులు టి ప్రశాంతి, కొడాలి సుధాకర్, జుజ్జువరపు ప్రశాంతి, రాయళ ప్రభాకర్ రావు పాల్గొన్నారు.

జల జీవన్ మిషన్పై అవగాహన

ప్రజాశక్తి-ఉంగుటూరు : ఉషా రామ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్-ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పొట్టిపాడు గ్రామంలో జల జీవన్ మిషన్ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ వి శ్రీహరి బాబు పాల్గొని మాట్లాడుతూ శుద్ధమైన తాగునీటి తీసుకోవాలని, ఆరోగ్య పరిరక్షణలో తాగునీటి పాత్ర చాలా ముఖ్యమని, అలాగే నీటి వనరుల సంరక్షణ మనందరి బాధ్యత అని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జివికెఎస్ వి ప్రసాద్, అధ్యాపకులు, వాలంటీర్లు, పాల్గొన్నారు.

'స్వచ్ఛతాహి సేవ'ను విజయవంతం చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

జిల్లాలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాలను కలిసికట్టుగా సమన్వయంతో ముమ్మరంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డికె బాలాజీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ నగరంలోని మీకోసం సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ సీఈవో కె కన్నమనాయుడు, జిల్లా పంచాయతీ అధికారి జె అరుణలతో కలిసి స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం కేవలం గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలకు మాత్రమే సంబంధించినది కాదని అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో కలిసికట్టుగా చేపట్టి వచ్చే అక్టోబర్ నెల 2వ తేదీ వరకు విజయవంతంగా నిర్వహించాలన్నారు. మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు డివిజనల్ స్థాయి అభివృద్ధి అధికారులు నేతృత్వం వహించి ఈ కార్యక్రమాలను సజావుగా నిర్వహించాలన్నారు.

'చలో విజయవాడ'ను జయప్రదం చేయాలి

- కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు

ప్రజాశక్తి-మైలవరం : నూతన కౌలు రైతు చట్టం తీసుకురావాలని కోరుతూ ఈ నెల 22న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పీవీ ఆంజనేయులు పిలుపునిచ్చారు. మండలంలోని చంద్రగూడెం, పుల్లూరు గ్రామాలలో పర్యటించి శుక్రవారం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు రూ.20 వేలు ఆర్థిక సహాయం చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు గ్రామ సభలు పెట్టి రుణ అర్హత కార్డులను మంజూరు చేయాలని అన్నారు. భూమిలేని కౌలు రైతులకు పెట్టుబడి సాయం కింద ఒకే విడతలో రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులు, కౌలు రైతుల సమస్యల కోసం జరిగే చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రావుల సుబ్బారావు పాల్గొన్నారు.


కర పత్రాను పంపిణీ చేస్తున్న కౌలు రైతు సంఘం నేతలు

దసరా ఉత్సవాలకు రావాలని పవన్ కల్యాణ్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి - విజయవాడ సిటీ



విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఈ నెల 22 నుంచి జరిగే శ్రీ కనకదుర్గమ్మ అమ్మ వారి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను ఆలయ ఈవో వికె శీనానాయక్ ఆహ్వానించారు. శుక్రవారం శాసన సభ విరామ సమయంలో పవన్ కల్యాణ్‌ను కలిసి ఆహ్వాన పత్రికతోపాటు అమ్మవారి ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పవన్ కల్యాణ్‌కు వేద ఆశీర్వచనాలు అందజేశారు.

జాతీయస్థాయి ఎన్‌సిసి క్యాంప్‌నకు కెబిఎన్ విద్యార్థి

ప్రజాశక్తి - విజయవాడ సిటీ :అక్టోబరులో గుజరాత్‌లో జరుగబోయే స్పెషల్ నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంపునకు మన రాష్ట్రం నుంచి తమ విద్యార్థి సార్జంట్ సిహెచ్.టి.ఎన్.సుభాష్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి తెలిపారు. కళాశాలలో



శుక్రవారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ డ్రిల్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరచటం ద్వారా రాష్ట్రంలోని అన్ని బెటాలియన్ల నుంచి తమ విద్యార్థి సుభాష్ ఆంధ్రప్రదేశ్ ప్రతినిధిగా ఈ క్యాంపునకు ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కళాశాల కార్యదర్శి డాక్టర్ టి.శ్రీనివాసు మాట్లాడుతూ క్రమశిక్షణతో కఠిన సాధన చేసిన సుభాష్‌ను అభినందించారు. ఐజిసి ఆర్‌డిసి పెరేడ్‌కు ఎంపికైన టి.బి.ఎన్. శ్రీనివాస్, కె.ప్రవంతిలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి అధికారి కెప్టెన్ కెపిటి విజయభాస్కర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామకృష్ణ, పాల్గొన్నారు.



దసరా ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : యాత్రికులకు ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా దసరా మహోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. ఈ నెల 22న ప్రారంభమయ్యే దసరా మహోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్ల నిరంతర పర్యవేక్షణలో భాగంగా శుక్రవారం క్షేత్రస్థాయిలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. అమ్మవారి జన్మ నక్షత్రమైన మూలా నక్షత్రం రోజున అధిక సంఖ్యలో వచ్చే యాత్రికులను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశామన్నారు. కేశఖండనశాల, స్నాన ఘట్టాలు, క్యూలైన్లు, పార్కింగ్, భద్రత.. ఇలా ప్రతి విషయాన్నీ క్షుణ్ణంగా పరిశీలించినట్లు తెలిపారు. భవాని మాలదారులు చేపట్టే గిరి ప్రదర్శనతో ముడిపడిన అంశాలనూ తనిఖీ చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అమ్మవారి దర్శనం, నగర పర్యటన మధురానుభూతులను మిగిల్చేలా ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

'వాహన మిత్ర' దరఖాస్తు గడువు పెంచాలి

ప్రజాశక్తి-విజయవాడ :



ఆటో, క్యాబ్ డ్రైవర్లకు వాహన మిత్ర పథకం అమలు కోసం దరఖాస్తు చేసుకునే గడువు ఈ నెలాఖరు వరకు పొడిగించాలని విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి కె.దుర్గారావు ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక బిఆర్‌టిఎస్ రోడ్డులోని నందూరి ప్రసాద్ రావు భవన్‌లో ఆటో కార్మికుల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశానికి సెంట్రల్ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ఎం.హనుమంతరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ... ఆటో, క్యాబ్ డ్రైవర్లకు వాహన మిత్ర పథకం అమలు కోసం ఈ నెల 17, 18, 19 తేదీలలో దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఆటో, క్యాబ్ డ్రైవర్లు సచివాలయాలు చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. వాహన మిత్ర అమలు కావాలంటే పథకానికి అనేక ఆంక్షలు పెట్టడంతో దరఖాస్తులు చేసుకోలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఇప్పటికే చాలా మంది దరఖాస్తులు చేసుకోలేకపోయారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెలాఖరు వరకు గడువు పొడిగించాలని డిమాండ్ చేశారు.

నూతన ఆవిష్కరణల దిశగా ఇంజినీర్లు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

ఇంజనీర్ల విలక్షణ ఆలోచనలను నిత్యం కోట్లాది మంది జీవితాలను ప్రభావితం చేసే ప్రత్యక్ష పరిష్కారాలుగా మార్చే ఆవిష్కరణల రూపశిల్పులని పలువురు వక్తలు అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. ఈ సందర్భంగా నగర ప్రముఖులు దీప్తి ప్రతి మాట్లాడుతూ అభివృద్ధి చేయడం వంటి సంక్లిష్ట సమస్యలను పరిష్కరించడానికి వారు సాంకేతిక నైపుణ్యాన్ని సజనాత్మకతతో మిళితం చేస్తారన్నారు. అమెజాన్ ఆవిష్కరణల వెనుక ఇంజనీర్లు చోదక శక్తిగా ఉందని తెలిపారు. వినియోగదారుని కోణం నుంచి ఆలోచిస్తూ పని చేయడం, అతని అనుభవాన్ని సరళీకృతం చేయడానికి, మెరుగుపరచడానికి సాంకేతికతను ఉపయోగించడం అనే కంపెనీ సిద్ధాంతానికి వారు ప్రతిబింబంలాంటివారు అని తెలిపారు.

అందుబాటులోకి సామ్‌సంగ్ గెలాక్సీ ఎఐ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

ఈ ఏడాది చివరి నాటికి 400 మిలియన్ల పరికరాలకు గెలాక్సీ ఎఐ తీసుకురానున్నట్లు సామ్‌సంగ్ రీజినల్ ఇంచార్జి పి.కుమార్ తెలిపారు. నగరంలోని శాంసంగ్ స్టోర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. 2024లో ప్రపంచంలోని మొట్టమొదటి ఎఐ ఫోన్, గెలాక్సీ ఎస్24 సిరీస్‌ను సామ్‌సంగ్ విడుదల చేసిందని తెలిపారు. ఇది ఎఐ ఆవిష్కరణకు మార్గం సుగమం చేసిందన్నారు. ఇటీవల విడుదల చేసిన గెలాక్సీ జెడ్ సిరీస్, వన్ యుఐ 8 ద్వారా సామ్‌సంగ్ అత్యంత మెరుగైన ఫీచర్లను చేర్చడంతో గెలాక్సీ ఏఐని మరింత మంది వినియోగదారుల చెంతకు తీసుకువచ్చిందని తెలిపారు.

టైలర్లను ఆదుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి -చందర్లపాడు : టైలర్‌లకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయాలని, సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని సిఐటియు ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు టైలర్స్ వర్కర్స్



యూనియన్ చందర్లపాడు మండల జనరల్ బాడీ సమావేశం షేక్ కరీం అధ్యక్షతన చందర్లపాడులో శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ చదువుకున్నా తగిన ఉపాధి దొరక్కపోయినా ప్రభుత్వంపై ఆధారపడకుండా స్వయం ఉపాధి పొందుతూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. రెడీమేడ్ వస్త్రాల రాకతో పనుల్లే పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఈ నేపథ్యంలో టైలర్లను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూనియన్ అధ్యక్షులు షేక్ కరీం, యూనియన్ కార్యదర్శి సాధనాల రాము, పాల్గొన్నారు.

ఆటల పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-విస్సన్నపేట : విస్సన్నపేట మండలం నరసాపురం గ్రామంలో శుక్రవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆటల పోటీలు నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీడీవో చినరాట్నాలు చేతుల మీదగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 సుధాకర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం శోభలత, పిఇటి రమేష్ పాల్గొన్నారు.

కబేళా రోడ్డు అభివృద్ధి చేయాలని సంతకాల సేకరణ

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : 43, 45 డివిజన్ల కబేళా రోడ్డులో నెలల తరబడి కొనసాగుతున్న వాటర్ పైప్ పైప్ లైన్ల లీకేజీల కారణంగా ఏర్పడ్డ భారీ గోతుల్లో పడి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని సిపిఎం పశ్చిమ నగర



కార్యదర్శి బోయి సత్తిబాబు అన్నారు. దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయాలని మున్సిపల్ అధికారులకు, ప్రజాప్రతినిధులకు అనేక మార్లు విన్నవించుకున్నా పట్టించుకోకపోవడం బాధ్యతారాహిత్యమేనని విమర్శించారు. ప్రజాప్రతినిధులు అధికారుల తీరు నిరసిస్తూ శుక్రవారం కబేళా సెంటర్‌లో సంతకాల సేకరణ నిర్వహించినట్లు తెలిపారు. అధికారులు తక్షణమే పైపులైన్ల లీకేజీల్ని అరికట్టాలని, దెబ్బతిన్న రోడ్లను బాగు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సిపిఎం నగర కమిటీ సభ్యులు ఎండి మస్తాన్, డివిజన్ కార్యదర్శి ఏ శ్రీనివాస్, అప్పలరాజు పాల్గొన్నారు

యూరియా పంపిణీ చేయాలని ధర్నా

ప్రజాశక్తి -ఏ కొండూరు : మండలంలోని కుమ్మరికుంట్ల, రేపూడి తండా గ్రామాలకు చెందిన రైతులకు యూరియా అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కుమ్మరి కుంట, రేపూడి తండా



గ్రామాల రైతులు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాలో సిఐటియు ఎ.కొండూరు మండల కార్యదర్శి జెట్టి వెంకటేశ్వరావు, వ్యవసాయకార్మిక సంఘం మండల కార్యదర్శి పానెం ఆనందరావు పాల్గొని మాట్లాడారు. కుమ్మరి కుంట్ల, రేపూడి తండా రైతులకు యూరియా అందించాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం ఎ.కొండూరు తహసీల్దార్ కె.లక్ష్మికి వినతి పత్రం అంజేశారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి కుంట మాజీ సర్పంచ్ చంద్రునాయక్, గుగులోతు శ్రీను, పాల్తియా ప్రసాద్ రావు, పి.శ్రీనివాసరావు, పి.రమేష్, జి.నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

గిరిజన హక్కుల కోసం పోరాడిన 'చదల'

ప్రజాశక్తి- నందిగామ



ఆదిమ జాతి హక్కుల కోసం, రాష్ట్రంలో గిరిజన హక్కుల కోసం ఆదిమ జాతి సేవక్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చదల జానకీ రామారావు పోరాడారు. జానకీ రామారావు 1926లో కంచికచర్ల మండలం గండేపల్లిలో పేద కుటుంబంలో జన్మించారు. సెప్టెంబర్ 11న నందిగామ పాత బైపాస్ రోడ్డులోని ఆయన కుమారుడు సీతారామారావు గృహంలో తుది శ్వాస విడిచారు. రామారావుకు నలుగురు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. జానకి రామయ్య గిరిజన హక్కుల కోసం పోరాడారు. కళ ముంత, గిరిజన గోడు తదితర దీర్ఘ కాలిక అంశాలపై ఉద్యమాలు చేశారు. గిరిజన గోడు అనే మాస పత్రికను ప్రారంభించి పదేళ్లపాటు సంపాదక బాధ్యతలను నిర్వహించారు. కల్లుముంత నాటక రూపాలతో గిరిజనుల్లో చైతన్యం కలిగించారు. కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీకి ఎన్టీఆర్ హయాంలో ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. మాజీమంత్రి దేవినేని రమణకు కుడిభుజంగా ఉండేవారు. గ్రామ పంచాయతీ వార్డు సభ్యులుగా, ఉప సర్పంచిగా పని చేశారు. ఎస్టీ లకు స్థలాలు, ఇల్లు వచ్చే విధంగా కృషి చేశారు. న్యూ కాలనీ, డివిఆర్ కాలనీ అభివృద్ధికి పాటుపడ్డారు. చదల జానకీ రామారావు అకాల మరణం పట్ల కుటుంబ సభ్యులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య ప్రజాశక్తితో మాట్లాడుతూ చదల జానకి రామారావు జీవిత కాలం రాష్ట్రంలోని గిరిజనుల కోసం అహర్నిశలు శ్రమించారన్నారు. ఏపి సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్ బాలకోటయ్య మాట్లాడుతూ మూడు దశాబ్దాలకుపైగా జానకి రామారావుతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేశారు. ప్రజా రాజధాని అమరావతి ఉద్యమంలో తనకు అండగా ఉండే వారిని బాలకోటయ్య గుర్తు చేశారు.